# అతిథి

-ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి

ఆగిన రైలు ఎప్పుడు కదులుతుందో. రైల్లో కూర్చున్న జానకి మనసు పరిపరి విధాలుగా పోతోంది. రైలు ఆరు గంటలు లేటు. ఇంటికెళ్లేటప్పటికి ఇంకెంత ఆలస్యం అవుతుందో. కనీసం రాత్రి పదకొండు గంటలు కావచ్చు.

వాళ్ళకి ఎంత చిరాగ్గా ఉంటోందో. వాళ్ళకే కాదు తనకీ అంతే. అలాగే ఉంది. అర్ధరాత్రి వెళ్ళడం. వెళ్ళడం కాదు, స్టేషన్ నుంచే ఫోన్ చెయ్యాలి. ఎందుకంటే, ఇళ్ళు చాలా దూరం. ఆడవాళ్ళు ఒక్కళ్ళూ వెళ్ళాలంటే కష్టం. రాత్రి వచ్చి తనని తీసికెళ్ళమే కాదు, వండి పెట్టాలి. చిన్న స్టేషన్. తినడానికి ఏమీ దొరకవు. పోనీ తనే వండుకుందామంటే వినరు. కానీ నిద్ర కళ్ళతో అందరూ చిరాగ్గా చూస్తారు. "ఇంత రాత్రి కష్టపడి రాకపోతే ఏం" అంటారు పైకి ప్రేమ చూపిస్తున్నట్టు. తనకి చాలా సిగ్గుగా ఉంటుంది. కానీ తప్పదు, రావాల్సి వస్తుంది. మనస్సు ఊరుకోదు. ఇవన్నీ కలిసి తనకి కోపం తెప్పిస్తాయి.

ఒక్కసారి అందరినీ కడిగెయ్యాలనిపిస్తుంది. కానీ ఆ పని చెయ్యలేదు. మనస్సులోనే బాధపడుతుంది. కోపం దిగమింగుతుంది. వద్దనుకున్నా మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటుంది. మనస్సు లాగేస్తుంది.

అయినా ఇదివరకు అందరూ ఎలా ఉండేవారు. తను లేకపోతే ఉండలేనట్టే చేసేవారు. ఇప్పుడు తన అవసరం లేనట్టే ఉంటారు. ఎప్పుడైనా అంటే "ఎవరికీ అలాంటి భావాలు లేవే" అని సపోర్టు చేస్తాడు ఆ ఇంటి యజమాని. "నువ్వు ఇబ్బంది పడుతున్నావని వాళ్ళ భావం" అంటాడు పైనించి. తనకి ఇబ్బందనా, కాక వాళ్ళకి ఇబ్బందనా? తనకి అర్థంకాదా? చిన్నపిల్లా. భావాలు గ్రహించలేదా! ఇప్పుడు తను వస్తే వాళ్ళకి అసౌకర్యం. ఇలా ఉంటుంది బంధం.

రైలు కూతతో ఉలిక్కిపడింది. ఇళ్ళు చేరేసరికి పదకొండున్నర అయింది. ముసలాయన తలుపు తీశాడు. "వచ్చావా? రావేమో అనుకున్నాను ఈ వారం ఇంతవరకూ రాకపోతే" అన్నాడు. చివుక్కుమంది మనస్సు. ఆరునెలల క్రితం వరకు "ఈ ఇంటి వెలుగువి" అన్న మనిషి.

"వంట చేసి ఉంచాను టేబుల్ మీద. తిను" అంది దుప్పటి కొద్దిగా తొలగించి రమ. ఆ ఇంటికి పెద్దాడ పిల్ల.

"ఎందుకూ బ్రెడ్ ఉంటుందిగా" అంటూ ప్రేమగా అనబోతుంటేనే ఆ పిల్ల కళ్ళు మూసుకుపోయాయి.

"వచ్చావా. మళ్ళీ రేపు ఉంటావా? వెళ్ళాలా?" అంది దగ్గుతున్న డెబ్బై ఏళ్ళ అన్నపూర్ణమ్మ.

"వెళ్ళాలి" క్లుప్తంగా అంది. ఆమె భావం తెలుసు ఈకాడికెందుకు డబ్బు దండుగ అని భావం. "ఊ" అని గుఖ్ఖుపెట్టింది మళ్ళీ.

భోజనం చేసి పడగ్గదిలో ఉన్న చిన్న పిల్లలిద్దరినీ తనివితీరా ముద్దాడింది. ఈ చేతుల్తో పెంచింది. ఇన్నేళ్ళ బంధం ఎక్కడికి పోతుంది. ముఖ్యంగా చెప్పాలంటే వీళ్ళకోసమే వస్తుంది. కానీ తను వచ్చేసరికి వాళ్ళు మెలకువగా ఉండరు. అలాగే వెళ్ళేటప్పుడూ. తనని లేపనివ్వరు. లేస్తే తనని వెళ్ళనివ్వరని వాళ్ళ భయం. ఒకవిధంగా తనకి కూడ. అందుకే నిద్రలోనే తనివితీరా

## నైజం!!

మల్లెపూవు
సున్నితంగా
ఉంటుందని
మండు వేసవికి
'జాలి' ఉండదు.
చందమామ / అందంగా
ప్రకాశిస్తున్నా
కారుమబ్బులు
కమ్మక మానవు.
అయినా...
మండే వేసవిలోనే
మల్లె- విరుస్తుంది!
కారు మబ్బులు / కమ్మినపుడే
కాంతి విలువ
తెలుస్తుంది!!

-పురిజాల సుధాకర్

చూస్తుంది.

"వాళ్ళు లేస్తే కష్టం సుమా" అన్నాడు తెచ్చిపెట్టు కున్న నవ్వుతో మురళీధర్. యజమాని.

కళ్ళ నీళ్ళు తిరిగాయి. మౌనంగా వచ్చి మంచం మీద కూర్చుని సెల్‌లో అలారం ఆన్ చేసింది.

"ఎన్నింటికి?"

"అయిదింటికే. మొదటి బస్సుకే వెళ్ళాలి" అంది కొద్దిపాటి ఆనందంతో తన ప్రేమ, కష్టం గ్రహిస్తున్నా డనే ఆశతో.

"అబ్బా. అయితే నాలుగుకే లేవాలన్నమాట నిన్ను దింపడానికి. అయితే పడుకో" అన్నాడు కళ్ళలో లైటు పడకుండా దుప్పటి అడ్డం పెట్టుకుంటూ.

ఉక్రోషంగా లైటార్పి పడుకుంది జానకి. ఎంతసేపు తమ ఇబ్బందులే కాని, తాను ఎందుకొస్తోందీ గ్రహించుకోరు. తాను ఈ ఊరు వెళ్ళిన కొద్ది కాలానికే అందరూ మర్చిపోయారు తన సేవలు. తను ఎన్నిసార్లు రాత్రంతా నిద్రలేకుండా సేవలు చేసింది వీళ్ళకి. రోగా లకి, పరీక్షలప్పుడు. అన్నీ మరిచిపోయినట్లున్నారు. మండుతున్న కళ్ళు బలవంతంగా మూసుకుంది.

అలారం చప్పుడుకి మెలకువ వచ్చింది. వంటిం ట్లోకి వెళ్ళేసరికి రమ కాఫీ కలుపుతోంది. పక్కన ఇడ్లీ కుక్కర్ ఉంది స్టౌమీద.

"నేను చేస్తానుగా. నేను ఉన్నప్పుడు కూడా ఎందుకు?" అంది నిష్ఠురం, ప్రేమ కలిసిన గొంతుతో జానకి.

"ఫరవాలేదమ్మా. రాత్రి అంత కష్టపడి వచ్చావు. పొద్దునే వెళ్ళాలి. రైల్లో కూర్చోవాలి. ఆఫీసులో కూర్చుని పనిచెయ్యాలి వెళ్లగానే. ఆదివారం ఒక్కరోజు సెలవు నాడు హైరానా పడి మా కోసం వస్తావు. నీకెప్పుడు రెస్టు దొరుకుతుంది?" అంది వాటర్ బాటిల్‌లో నీళ్ళు పోస్తూ రమ.

"నిన్నయితే ఆదివారం ఆఫీసుకు వెళ్ళాల్సి వచ్చినా ఇక్కడికి వచ్చావుకదా" అంది మళ్ళీ.

జానకి ఆశ్చర్యపోయింది. దీనికెంత పోకిరితన మొచ్చింది. ఎనిమిదింటికి కాని లేచేది కాదు ఇది వరకు.

భర్త స్కూటర్ బయటపెట్టాడు. "డబ్బులు ఉన్నాయా? పాస్ అవీ సరిగా పెట్టుకున్నావా? నీకసలే మతిమరుపు ఎక్కువ" అన్నాడు.

"నేనున్నానుగా. బెంగపెట్టుకోకు పిల్లల కోసం. ధైర్యంగా ఉండు" అంది అత్తగారు షాల్ కప్పుకుని

## వింత నిజం

గుండెలు పిండే విషాదాల నేపథ్యంలో
ఎన్ని గొంతులు మూగగా రోదిస్తున్నాయి?
ఆకాశం దాకా విస్తరిస్తున్న విచారం వెనుక
ఎన్ని ఆశలు అవిరౌతూ నినదిస్తున్నాయి?

నలుపును నలుపే నలిపేస్తుంటే
తెలుపువాళ్ళ గడ్డ తెల్లబోతున్నది
కడుపు చేతబట్టుకుని వలస వెళ్ళిన మేధ
కరాళ నృత్యం చేసే పిశాచాలకు భయపడుతున్నది

ఇది జాతి ద్వేషంలా కనబడడంలేదు
నీతి తలొంచి నిష్క్రమిస్తున్న వైనం
చీకటిని వెలుగు తరమడంలేదు
చీకటిని చీకటే కబళిస్తున్న వింత నిజం

(అమెరికాలో పైచదువులు, ఉద్యోగాలకు వెడుతున్న వారిని నల్లవాళ్ళు హతమారుస్తున్న వైనాన్ని విని బాధతో...)

-రావెల పురుషోత్తమరావు

అరుగు మీద నుంచుంటూ కొద్దిపాటి దగ్గుతో.

"ఇంకెన్నాళ్ళులే. ఇంకొక్క ఆరునెలలు లేదా ఏడాది. ఇట్టే తిరిగిపోతుంది. ఈ ఊరు వచ్చేయొచ్చు మళ్ళీ" అన్నాడు మామగారు ధైర్యం చెబుతున్నట్టు. "ప్రమోషన్ వదులుకుంటే మళ్ళీ ఇప్పట్లో రాదన్నావు మరి" అన్నాడు.

"జాగ్రత్త మమ్మీ బై" అన్నాడు కొడుకు.

"మమ్మీ టాటా" కవలపిల్లలిద్దరూ ఎప్పుడు లేచారో అక్క చంకెక్కి టాటా చెబుతున్నారు. రమ ఏమి ఆశ చూపిందో ఏడవడంలేదు. జానకికి చెరో చెంపమీద ముద్దిచ్చారు. ఆత్రంగా ముద్దెట్టుకుంది మళ్ళీ ఇద్దరినీ జానకి.

"పద, పద రైలు టైమవుతోంది. లేటుగా వెళ్తే సీటు దొరకదు. నుంచోవాలి" ప్రేమగా మందలిస్తు న్నాడు భర్త.

"అమ్మా, టమోటా ఊరగాయ మామ్మ చెబితే చేశాను. రుచి చూపించు మీ రూమ్మేట్‌కు" అంది రమ బాటిల్ బుట్టలో సర్దుతూ.

"నా ఇంటికి నేనే అతిథిని అయ్యాను" నవ్వు కుంటూ కదిలింది రాత్రి బాధంతా మర్చిపోయి జానకి.

ఆరు నెలల క్రితం ప్రమోషన్ మీద వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిన జానకికి అటు ఉద్యోగ ధర్మం, ఇటు ఇల్లాలి ధర్మం వదలలేక. ■